
# ఇన్సూరెన్స్ ఉన్నా.. ఆరోగ్యం ఎవరి భరోసా?



## హాస్పిటల్స్, ఇన్సూరెన్స్ వ్యవస్థలో నలిగిపోతున్న సామాన్యుడు

యాంసాని శివకుమార్,ఎడిటర్, జనతా న్యూస్ – సంపాదకీయము : లక్షల రూపాయల వైద్య ఖర్చులు భరించలేకే సామాన్యుడు హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలను ఆశ్రయిస్తున్నాడు. కానీ అనారోగ్యం వచ్చినప్పుడు అదే ఇన్సూరెన్స్ ప్రయోజనం లేకపోతే, పాలసీ ఉద్దేశమే ప్రశ్నార్థకంగా మారుతోంది. ఇన్సూరెన్స్ కంపెనీలు ఏజెంట్లను నియమించుకుంటున్నా, వారికి సరైన శిక్షణ లేకుండా టార్గెట్ల ఆధారంగానే పాలసీలు విక్రయిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. “24 గంటలు హాస్పిటల్లో ఉంటే క్యాష్‌లెస్ ఖాయం” వంటి అపోహలతో చదువుకున్నవారు సైతం గుడ్డిగా నమ్మి పాలసీలు తీసుకుంటున్నారు. కానీ అసలు నిబంధనలు సూక్ష్మ అక్షరాల్లోనే పరిమితమవుతున్నాయి. అనారోగ్యంతో హాస్పిటల్‌కు వెళ్లిన తర్వాత క్లెయిమ్ ప్రక్రియ మరో పోరాటంగా మారుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. వేటింగ్ పీరియడ్, ప్రీఎగ్జిస్టింగ్ డిసీజ్, పాలసీ పరిధి వంటి కారణాలతో క్లెయిమ్‌లు తిరస్కరణకు గురవుతున్నాయని పలువురు వినియోగదారులు వాపోతున్నారు. దీంతో రోగి ఆరోగ్య సమస్యతో పాటు ఆర్థిక ఒత్తిడినీ ఎదుర్కొంటున్నాడు. ఇటీవల Star Health Insurance సహా కొన్ని హెల్త్ ఇన్సూరెన్స్ సంస్థలపై క్లెయిమ్ ఆలస్యం, స్పష్టత లేమిపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఫుకార్లు ఎలా ఉన్నా, కస్టమర్‌కు సరైన సమాచారం, సమయానికి స్పందన లేకపోవడమే ప్రధాన సమస్యగా మారుతోంది. మరోవైపు, ఇన్సూరెన్స్ ఉందని తెలిసిన వెంటనే కొన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో అవసరం లేకున్నా అడ్మిషన్లు, అనవసర టెస్టులు జరుగుతున్నాయన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. రోజుకు రూ.20 వేల వరకు రూమ్ చార్జీలు వసూలు చేస్తున్న సందరాలే సామాన్యుడిని కలవరపెడుతున్నాయి. ఈ ధోరణి కొనసాగితే, ఇన్సూరెన్స్ కవరేజ్ తగ్గే ప్రమాదం లేదా ప్రీమియంలు రెండుమూడింతలు పెరిగే పరిస్థితి తలెత్తే అవకాశముందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. చివరికి ఈ భారమంతా వినియోగదారుడి మీదే పడుతోంది. ఈ పరిస్థితులపై నియంత్రణ తీసుకురావడంలో IRDAI వంటి సంస్థల పాత్రపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఏజెంట్ల తప్పుడు ప్రచారం, క్లెయిమ్ తిరస్కరణలు, ఆస్పత్రుల బిల్లింగ్‌పై కఠిన నియంత్రణలు అవసరమన్న డిమాండ్ బలపడుతోంది.



**హెల్త్ ఇన్సూరెన్స్ నిజంగా సామాన్యుడికి రక్షణగా మారాలా?**
**లేక భయాన్ని, అయోమయాన్ని పెంచే వ్యవస్థగానే మిగలాలా?**
**ఈ ప్రశ్నకు స్పష్టమైన సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వం, నియంత్రణ సంస్థలదే**



[redacted]

| Name : | Mukkisa Shekhar Reddy | Age / Sex 40 y/M | Date 22/12/25 |
|---|---|---|---|
| Policy No : | 378011220406299 1 | Wt : | |
| | | Ht : | |
| | | BMI : | ALLERGIES IF ANY — |

CHIEF COMPLAINT C/o Cough, Fever | 5 days
No other complaints

Pod (Med & Surgery) : —

Social H/o - Smoking ☐ Alcohol ☐ Tobacco ☐

TREATMENT :
Syp - Ascoril LS 10ml 1-1-1 x 3d
Tab - Montek LC 0-0-1 x 3d
Tab - Paracetamol 650mg 1-1-1 x 3d
Tab - Cefixime 200mg 1-0-1 x 5d
Steam Inhalation

TO DO INVESTIGATION OR SPECIALIST REFERRAL IF ANY
—

Danger signs explained. Visit a Doctor in case an emergency/symptoms worsens/donot improve.

[redacted]

HHC ☐ HOSPITALIZATION ☐ REVIEW ☐ FOLLOW UP ☑



### “ఇన్సూరెన్స్ ఉన్నా.. నేను ఎక్కడికి పోవాలి?”

లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ముక్కిస శేఖర్ రెడ్డి, హాస్పిటల్‌లో అడ్మిట్ అయి ఉన్న సమయంలో తన ఆవేదనను జనతా న్యూస్‌తో పంచుకున్నాడు. “లక్షల రూపాయల ఖర్చులు భరించలేకే హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకున్నాను. ఐదేళ్లుగా పాలసీ కొనసాగిస్తూ, లక్ష రూపాయల వరకు ప్రీమియం కట్టాను. కానీ అవసరమైన సమయంలో మెడిసిన్ రాసిచ్చి ,క్లెయిమ్‌ను రిజెక్ట్ చేసి ఇంటికి వెళ్ళు మన్నారు. ఇన్సూరెన్స్ ఉంటే భరోసా అనుకున్నా.

ఇప్పుడు నేను ఎక్కడికి పోవాలి? నాకు న్యాయం జరగకపోతే, కోలుకున్న తర్వాత చట్టపరంగా పోరాటం చేస్తాను,అని శేఖర్ రెడ్డి వాపోయాడు.

# విశాఖలో శ్రీలంకపై భారత్ అద్భుత విజయం





**129 పరుగుల లక్ష్యాన్ని 11.5 ఓవర్లలో ఛేదించిన టీమిండియా**

**7 వికెట్ల తేడాతో శ్రీలంకపై భారత్ విజయం**

**5 టీ20ల సిరీస్‌లో 2-0తో భారత్ ఆధిక్యం**

శ్రీలంకతో జరుగుతున్న ఐదు టీ20 మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా విశాఖపట్నంలో జరిగిన రెండవ మ్యాచ్‌లో భారత మహిళల జట్టు అద్భుత విజయం సాధించింది. 129 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా 11.5 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. తద్వారా 7 వికెట్ల తేడాతో ఘన విజయం నమోదు చేసింది. ఈ గెలుపుతో భారత్ సిరీస్‌లో 2–0 ఆధిక్యంలో నిలిచింది. షెఫాలీ వర్మ అద్భుతమైన బ్యాటింగ్‌తో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. ఆమె 34 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్సుతో 69 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచింది. మిగిలిన బ్యాటర్లలో జెమీమా రోడ్రిగ్స్ 26 పరుగులు, స్మృతి మంధాన 14 పరుగులు, హర్మన్ ప్రీత్ కౌర్ 10 పరుగులు చేశారు.

అంతకముందు, టాస్ ఓడిపోయి బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 128 పరుగులు చేసింది. శ్రీలంక బ్యాటర్లలో హర్షిత 33 పరుగులు, చమరి ఆటపట్టు 31 పరుగులు, హాసిని పెరీరా 22 పరుగులు చేశారు. భారత బౌలర్లలో శ్రీచరణి, వైష్ణవి శర్మ చెరో రెండు వికెట్లు తీయగా, క్రాంతి గౌడ్, స్నేహ్ రాణా చెరో వికెట్ పడగొట్టారు.

# ఫిబ్రవరి 13 నుంచి టాలీవుడ్ ప్రో లీగ్

తెలుగు సినీ, క్రీడాభిమానులకు ఇదో డబుల్ బొనాంజా న్యూస్. ఒకేసారి ఇటు సినీ అభిమానులను అటు క్రికెట్ ఫ్యాన్స్‌ను అలరించే టీపీఎల్ టాలీవుడ్ ప్రొ లీగ్‌కు సర్వం సిద్ధమైంది. ప్రముఖులు పాల్గొనే ఈ టోర్నీ ఫిబ్రవరి 13 నుంచి హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో జరగనుంది. మాదాపూర్ హెచ్ఐసీసీలో ఆదివారం ఈ లీగ్ ట్రోఫీని, జెర్సీని సినీ, క్రికెట్ ప్రముఖులు ఆవిష్కరించారు. దిగ్గజ క్రికెటర్లు కపిల్ దేవ్, వీరేంద్ర సెహ్వాగ్, సురేశ్ రైనాలతో పాటు సినీ నిర్మాత దిల్ రాజు, నటుడు సోనూ సూద్, సంగీత దర్శకుడు తమన్, నటి రాశీ ఖన్నా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కపిల్ దేవ్, వీరేంద్ర సెహ్వాగ్, దిల్ రాజు, సోనూ సూద్ కలిసి స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్ ఆడారు. టాలీవుడ్.. క్రికెట్ పట్ల ఆసక్తి చూపడం అభినందనీయమన్నారు కపిల్‌దేవ్. హైదరాబాద్ అందమైన నగరమే కాదు, రుచికరమైన వంటకాలకు కేంద్రమని కొనియాడారు. సినీ నటులు, టెక్నీషియన్లు కలిసి క్రికెట్ లీగ్ ఆడటం మంచి పరిణామమన్నారు వీరేంద్ర సెహ్వాగ్. తెర మీద కనిపించే నటులతో పాటు తెర వెనుక ఉండి పని చేసేవారితో కలిసి టీపీఎల్ టోర్నీ జరుగుతుందన్నారు దిల్‌రాజు. ఆరు జట్లతో కూడిన ఈ ఫ్రాంచైజీ ఆధారిత లీగ్‌లో ప్రముఖ నిర్మాతలు జట్లకు యజమానులుగా వ్యవహరిస్తారని తెలిపారు.



# సర్వమత సమభావనతోనే రాష్ట్ర ప్రగతి

**క్రైస్తవ సోదరులకు వరాల జల్లు**

**హుస్నాబాద్‌లో క్రైస్తవ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు**

**క్రిస్మస్ వేడుకలలో మంత్రి పొన్నం ప్రభాకర్**



హుస్నాబాద్, జనత న్యూస్:ప్రపంచవ్యాప్తంగా ప్రజలందరూ శాంతి, ప్రేమతో మెలగాలన్నదే ఏసు క్రీస్తు సందేశమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.హుస్నాబాద్‌లోని లక్ష్మీ గార్డెన్స్‌లో మంగళవారం ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మత పెద్దలు మంత్రికి ప్రత్యేక ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ.. మానవజాతి సన్మార్గంలో పయనించాలని, ద్వేషభావం వీడి అందరూ బాగుండాలనే తపనతోనే భగవంతుడు భూమిపై జన్మించి సన్మార్గం బోధించారని కొనియాడారు. తెలంగాణ ప్రజా పాలనలో అన్ని మతాలకు సమ ప్రాధాన్యం కల్పిస్తున్నామని, విద్వేషాలకు తావులేకుండా పరస్పర గౌరవంతో రాష్ట్రం ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని, ముఖ్యంగా గౌరవెల్లి ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని భరోసా ఇచ్చారు. విద్యా, వైద్యం, ఉపాధి రంగాల్లో నియోజకవర్గాన్ని అగ్రగామిగా నిలుపుతామని, ఇందులో భాగంగానే పీజీ స్థాయి వైద్య సదుపాయాలు కల్పిస్తామన్నారు. క్రైస్తవ సోదరుల సౌకర్యార్థం హుస్నాబాద్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.25 లక్షలు కేటాయిస్తున్నామని, అలాగే బుధవారమే శ్మశానవాటిక స్థలానికి సంబంధించిన హద్దులు నిర్ణయించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా, సంతోషంగా ఉంటూ పండుగ జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, ఆర్డీవో రామ్మూర్తి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ గౌడ్, పలువురు సర్పంచ్‌లు, పాస్టర్లు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# హుస్నాబాద్ అభివృద్ధిలో రాజీ పడొద్దు..

**జనవరి 15లోగా గ్రామస్థాయి సమస్యలపై నివేదికలు అందించాలి**

**అధికారులు, నూతన సర్పంచ్‌ల సమన్వయంతోనే పనుల వేగవంతం**

**ఏడు మండలాల అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష**



హుస్నాబాద్,జనత న్యూస్: హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని, అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను హెచ్చరించారు. మంగళవారం హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాల అధికారులతో కలిసి ఆయన అభివృద్ధి పనులపై సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఉన్న సమస్యలపై క్షేత్రస్థాయి పరిశీలన జరిపి, జనవరి 15 లోపు సమగ్ర నివేదిక రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. జనవరి మొదటి వారం తర్వాత నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లతో మండలాల వారీగా ప్రత్యేక సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేస్తామని ఆయన వెల్లడించారు.

ప్రజా పాలనలో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్ కార్డులు, సన్న బియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు వడ్డీ లేని రుణాలు వంటి పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని అధికారులకు సూచించారు. ఉచిత విద్యుత్ పథకంలో తలెత్తిన సాంకేతిక ఇబ్బందుల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే శంకుస్థాపన చేసిన రోడ్లు, అంగన్‌వాడీ భవనాలు, పంచాయతీ భవనాల పనుల్లో జాప్యంపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయ మెట్ల నిర్మాణం మందకొడిగా సాగడంపై అధికారులను ప్రశ్నించారు. పంచాయతీ రాజ్ శాఖలో పెండింగ్‌లో ఉన్న బిల్లులను వారం రోజుల్లో విడుదల చేస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఉమ్మాపూర్‌లో 10 కోట్ల రూపాయలతో అర్బన్ పార్క్ ఏర్పాటు చేయనున్నామని, కరీంనగర్ కొత్తపల్లి నుండి హుస్నాబాద్ మీదుగా జనగాం వరకు నాలుగు వరుసల రహదారిని నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు. హుస్నాబాద్‌లో కబడ్డీ అకాడమీతో పాటు వచ్చే రెండు నెలల్లో స్టేడియంలో స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి మండలానికి ఒక మెడికల్ కాలేజీని దత్తత ఇచ్చి గ్రామాల్లో క్రమం తప్పకుండా మెడికల్ క్యాంపులు నిర్వహించాలని, హుస్నాబాద్‌ను ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా మార్చాలని పిలుపునిచ్చారు. గౌరవెల్లి ప్రాజెక్ట్ కాలువల భూసేకరణ పనులను వేగవంతం చేసి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయాలని అధికారులను ఆదేశించారు. జనవరి 1 నుండి గ్రామాల్లో మహిళల కోసం ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీవో రామ్మూర్తితో పాటు ఏడు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వివిధ శాఖల ఇంజనీర్లు పాల్గొన్నారు.

# కరీంనగర్ పోలీసులకు సైబర్ నేరాలు, డిజిటల్ లావాదేవీలపై ఆర్బీఐ అవగాహన సదస్సు





కరీంనగర్, జనతా న్యూస్ : సైబర్ నేరాలు, డిజిటల్ లావాదేవీల్లో జరుగుతున్న మోసాలను ఎదుర్కొనేందుకు పోలీసు సిబ్బందికి అవగాహన ఎంతో అవసరమని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఆధ్వర్యంలో మంగళవారం కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని 'అస్త్ర' హాలులో ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్ అవగాహన మరియు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డిజిటల్ లావాదేవీలు, సైబర్ మోసాలు, నకిలీ నోట్ల గుర్తింపుపై పోలీసు అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం లక్ష్యంగా నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, ప్రస్తుతం సమాజంలో సైబర్ నేరాలు వేగంగా పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నేరగాళ్లు అనుసరిస్తున్న కొత్త కొత్త మోసపూరిత పద్ధతులపై పోలీసు అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉంటేనే బాధితులకు త్వరితగతిన న్యాయం అందించగలమని ఆయన సూచించారు. ఈ సదస్సులో ఇటీవల సంచలనం సృష్టిస్తున్న 'డిజిటల్ అరెస్ట్', లాటరీ మోసాలు, అనుమానాస్పద లింక్‌ల ద్వారా జరుగుతున్న సైబర్ నేరాలపై వివరించారు. అలాగే యూపీఐ, ఎన్ఈఎఫ్టీ, ఆర్టీజీఎస్, ఐఎంపీఎస్ వంటి లావాదేవీల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ముఖ్యంగా యూపీఐ పిన్ భద్రతపై అవగాహన కల్పించారు. అసలు నోట్లకు, నకిలీ నోట్లకు మధ్య ఉండే తేడాలను ఎలా గుర్తించాలి, నకిలీ నోట్ల విషయంలో పాటించాల్సిన నిబంధనలు, నోట్ రీఫండ్ నియమాలపై వివరించారు. డిజిటల్ లావాదేవీల్లో పొరపాట్లు జరిగినప్పుడు లేదా మోసపోయినప్పుడు ఫిర్యాదు చేసే విధానం, ఆర్బీఐ అంబుడ్స్‌మన్ సేవల వినియోగంపై కూడా అవగాహన కల్పించారు. నగదు రహిత లావాదేవీల వల్ల కలిగే ప్రయోజనాలు, సైబర్ భద్రతా చిట్కాలను పోలీసు సిబ్బందికి ప్రాక్టికల్‌గా వివరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) వెంకటరమణ, ఆర్బీఐ అధికారులు, ఆర్బీఐ ఇంటిగ్రేటెడ్ బ్యాంకింగ్ మేనేజర్ సత్యజిత్ ఘోష్, మేనేజర్ ఖాదర్ హుస్సేన్, వెంకటరమణ, కమిషనరేట్ పరిధిలోని ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఓసీల సింహగర్జన... విజయవంతం చేయండి

**ఈడబ్ల్యూఎస్ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించాలి**

**ఆదాయ పరిమితిని రూ.10 లక్షలకు పెంచాలి**

**పోస్టర్ ఆవిష్కరణలో ఓసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గోపు జయపాల్ రెడ్డి**



హుస్నాబాద్, జనత న్యూస్: ఓసీల హక్కుల సాధన కోసం జనవరి 11వ తేదీన హన్మకొండలో నిర్వహించనున్న 'సింహగర్జన' బహిరంగ సభను విజయవంతం చేయాలని ఓసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గోపు జయపాల్ రెడ్డి పిలుపునిచ్చారు.మంగళవారం హుస్నాబాద్ పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన జాతీయ, రాష్ట్ర నాయకులతో కలిసి సభకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జయపాల్ రెడ్డి మాట్లాడుతూ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఈడబ్ల్యూఎస్) సంక్షేమం కోసం జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో చట్టబద్ధతతో కూడిన కమిషన్లను తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లకు సంబంధించి ప్రస్తుతం ఉన్న రూ.8 లక్షల వార్షిక ఆదాయ పరిమితిని రూ.10 లక్షలకు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు.ఓసీల్లోని పేదలకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని, సింహగర్జన సభ ద్వారా ప్రభుత్వాల కళ్లు తెరిపిస్తామని హెచ్చరించారు. ఈ సభకు ఓసీ సామాజిక వర్గాల ప్రజలు వేలాదిగా తరలివచ్చి ఐక్యతను చాటాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ఓసీ జేఏసీ జాతీయ చైర్మన్ నల్ల సంజీవరెడ్డి, నాయకులు నడిపెల్లి వెంకటేశ్వర్ రావు, గంప శ్రీనివాస్, అయిలేని మల్లికార్జున రెడ్డి, కొత్త శ్రీనివాస్, తనుగుల ఆంజనేయులు, చంద శ్రీనివాస్, రవి, తెరాల మారుతి, హేమలత, లత, పందిల్లా శంకర్, మర్యాల రాజీ రెడ్డి, మడుపు యాదవ రెడ్డి, గాల్ రెడ్డి, జానకీరాం రెడ్డి, కాయిత లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పేదల పని హక్కును కాలరాస్తున్న మోదీ ప్రభుత్వం: బీఎస్పీ నేత రవీందర్ గౌడ్ ధ్వజం




హుస్నాబాద్,జనత న్యూస్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో అశాస్త్రీయ మార్పులు చేస్తూ పేదల పని హక్కును కాలరాస్తోందని బీఎస్పీ నియోజకవర్గ ఇన్చార్జ్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్ తీవ్రంగా విమర్శించారు. మంగళవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ... 2005 సంవత్సరంలో యూపీఏ ప్రభుత్వం ఎంతో కసరత్తు చేసి, పార్లమెంటు ఉభయ సభలతో పాటు స్టాండింగ్ కమిటీలు, ఆర్థిక సంఘాల మధ్య ఏడాది పాటు చర్చించిన తర్వాత మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తీసుకువచ్చిందని గుర్తు చేశారు. పేదలకు కనీసం 100 రోజుల పని కల్పించాలనే సమున్నత లక్ష్యంతో ప్రారంభమైన ఈ పథకాన్ని ప్రస్తుత మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు.గత శీతాకాల సమావేశాలలో ఎంపీలకు, ప్రతిపక్షాలకు కనీస సమాచారం ఇవ్వకుండా, ఎలాంటి చర్చ లేకుండానే "విబి రాంజీ" అనే కొత్త ఉపాధి హామీ పథకాన్ని తీసుకురావడం దుర్మార్గమని ఆయన ఆరోపించారు. గతంలో ఈ పథకానికి కేంద్రం 90 శాతం నిధులు భరిస్తే, రాష్ట్రాలు కేవలం 10 శాతం నిధులు మాత్రమే ఇచ్చేవని, కానీ కొత్త పథకంలో కేంద్రం వాటాను 60 శాతానికి తగ్గించి రాష్ట్రాలపై 40 శాతం భారం మోపారని ధ్వజమెత్తారు. దీనివల్ల నిధుల కోసం పేదలు కేంద్రం దయదాక్షిణ్యాలపై ఆధారపడాల్సి వస్తుందని, ముఖ్యంగా ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు కేంద్రం మొండిచేయి చూపే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే కేంద్రం సూచించిన ప్రదేశాల్లోనే పని చేయాలనే నిబంధన పేదల ప్రయోజనాలకు విరుద్ధమని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్రంలో గత ఏడాది కోటి మంది పేదలు, వ్యవసాయ కూలీలు ఉపాధి పొందారని కేంద్రమే స్వయంగా వెల్లడించిందని, ఇప్పుడు ఇన్ని ఆంక్షలు విధించడం వల్ల వారంతా ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని రవీందర్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే తన వైఖరిని మార్చుకుని, పాత ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని బీఎస్పీ పక్షాన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు దేగల వెంకటేష్, ఎలగందుల శంకర్, వెలుపుల రాజు, రాంబాబు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు లేనిదే రాజ్యం లేదు

**బొమ్మనపల్లి సర్పంచ్ కొంకట మౌనిక చక్రధర్**



చిగురుమామిడి,జనత న్యూస్: దేశానికి వెన్నుముకగా నిలిచే రైతు లేనిదే రాజ్యం లేదని బొమ్మనపల్లి గ్రామ సర్పంచ్ కొంకట మౌనిక చక్రధర్ అన్నారు. మంగళవారం గ్రామ పరిధిలో నిర్వహించిన రైతు దినోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామంలోని రైతులను శాలువాలతో సత్కరించి, 'శతమానం భవతి' అని దీవిస్తూ ఘనంగా సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... ప్రభుత్వాలు రైతులకు వెన్నుదన్నుగా నిలవాలని, సాగు సమయానికి ఎరువులు అందించడంతో పాటు విత్తనాలను సబ్సిడీ ధరకే సరఫరా చేయాలని కోరారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని ఆమె స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ కాసర్ల హరీష్ కుమార్, వార్డ్ మెంబర్ కంది శంకర్, మాజీ ఎంపీటీసీ మిట్టపల్లి మల్లేశం, పెండేల సదానందం, రైతులు చెట్ల మొగిలి, వెంకటరాజం, దరిపెల్లి బాలయ్య, రవి, మాచ మల్ల బుజ్జన్న, గంట సమ్మయ్య, నిమ్మ రమాకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలి

### బ్లాక్ స్పాట్స్‌పై ప్రత్యేక దృష్టి - జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు ఘనంగా నిర్వహించాలి




కరీంనగర్, జనతా న్యూస్: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు మరిన్ని పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రహదారులు -భవనాల శాఖ, పోలీస్, రవాణా, వైద్య ఆరోగ్యశాఖ, ఆర్టీసీ తదితర శాఖల అధికారులతో జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో తరచుగా ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలు, గత సమావేశంలో గుర్తించిన బ్లాక్ స్పాట్స్ వద్ద చేపట్టిన చర్యలు, జిల్లాలో ఉన్న బ్లాక్ స్పాట్స్ సంఖ్యపై అధికారుల నుంచి వివరాలు కలెక్టర్ తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి ప్రాణ నష్టం జరగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రమాద అవకాశం ఉన్న ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, వాహనాల వేగ నియంత్రణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో వాటికి గల కారణాలను విశ్లేషించి నివారణ చర్యలు అమలు చేయాలన్నారు. జాతీయ రహదారి సంస్థ, పంచాయతీరాజ్, మున్సిపల్ అధికారులు రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యల నివేదికలను సమర్పించాలని ఆదేశించారు.

ఆర్టీసీ, ప్రైవేట్ బస్సుల్లో తప్పనిసరిగా ప్రథమ చికిత్స పెట్టె (ఫస్ట్ ఎయిడ్ కిట్) ఉండేలా చూడాలని, పాఠశాల బస్సులపై ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబర్‌ను స్పష్టంగా అతికించాలని సూచించారు. జనవరి 1 నుంచి 31వ తేదీ వరకు జిల్లాలో నిర్వహించనున్న జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ కోరారు. ఈ ఉత్సవాల్లో భాగంగా పాఠశాల విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించాలని, తిమ్మాపూర్‌లోని సారథి ట్రాఫిక్ అవగాహన పార్కును విద్యార్థులు సందర్శించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విభిన్న కార్యక్రమాల ద్వారా రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని సూచించారు. ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్ల వివరాలను వెల్లడించారు. గత ఏడాది కాలంలో జరిగిన ప్రమాదాలు, మృతుల సంఖ్యపై సమాచారం అందించారు. కరీంనగర్%–%జగిత్యాల రహదారి వెంబడి చెట్ల కొమ్మలు ఎక్కువగా ఉండటంతో రాత్రి వేళల్లో దారి కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకుని వాహనదారుల ఇబ్బందులను తొలగించాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్టీఏ సభ్యులు పడాల రాహుల్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కరీంనగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ నూతన భవన ప్రారంభం



కరీంనగర్, డిసెంబర్ 23: కరీంనగర్ నగర ప్రజలకు మరింత సమర్థవంతమైన పోలీసు సేవలు అందించాలనే లక్ష్యంతో ఆధునీకరించిన టూ టౌన్ పోలీస్ స్టేషన్ నూతన భవనాన్ని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ మంగళవారం అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, నూతనంగా ఏర్పాటు చేసిన విభాగాలను పరిశీలించారు. గతంలో భవనపు పై అంతస్తులో పనిచేసిన సీసీఎస్ పోలీస్ స్టేషన్‌ను రూరల్ ఏసీపీ కార్యాలయ ఆవరణకు మార్చడంతో, మొత్తం భవనాన్ని టూ టౌన్ పోలీస్ స్టేషన్ అవసరాలకు అనుగుణంగా కేటాయించారు.

పోలీస్ స్టేషన్ పరిధిలో సిబ్బంది సంఖ్య పెరగడం, ముఖ్యంగా మహిళా పోలీసుల సంఖ్య అధికం కావడంతో, వారి సౌకర్యార్థం ప్రత్యేక విశ్రాంతి గది, బారక్‌తో పాటు ఇతర మౌలిక వసతులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, పోలీసు అధికారులు, సిబ్బందికి మెరుగైన పని వాతావరణం కల్పిస్తే వారు మరింత ఉత్సాహంగా ప్రజలకు సేవలందించగలరని తెలిపారు. ఆధునిక సదుపాయాలతో సిద్ధమైన ఈ పోలీస్ స్టేషన్ ద్వారా ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. మహిళా సిబ్బంది సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించి వసతులు కల్పించడం సంతోషకరమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు వెంకటరమణ, ఏసీపీలు శ్రీనివాస్, వెంకటస్వామి, విజయకుమార్, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ సృజన్ రెడ్డి, పలువురు ఇన్‌స్పెక్టర్లు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గురుకుల విద్యాలయాలకు గ్రీజర్ల పంపిణీ



పెద్దపల్లి జిల్లా, డిసెంబర్ 23: సామాజిక సంక్షేమ శాఖ పరిధిలోని గురుకుల విద్యాలయాల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో, సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి గురుకుల విద్యాలయానికి 17 గ్రీజర్లు, భూపతిపూర్ జ్యోతిబాపూలే గురుకుల విద్యాలయానికి 23 గ్రీజర్లను పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు తన సొంత ఖర్చులతో కొనుగోలు చేసి స్థానిక నాయకులతో కలిసి పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, చలికాలంలో విద్యార్థులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో గ్రీజర్లను అందజేశామని తెలిపారు. అలాగే ఈ రెండు విద్యాలయాల్లో విద్యుత్, ప్లంబింగ్ పనుల కోసం కూడా తన సొంత ఖర్చులతో నిధులు సమకూర్చినట్లు చెప్పారు. గ్రీజర్లు, ఇతర మౌలిక వసతుల ఏర్పాటుకు మొత్తం రూ.8 లక్షల వరకు వ్యయం చేసినట్లు వెల్లడించారు. భూపతిపూర్ గురుకుల విద్యాలయంలో ఫ్యాన్లు, అవసరమైన వంట సామాగ్రి కొనుగోలుకు కూడా త్వరలో నిధులు కేటాయిస్తానని ప్రకటించారు. రెండు రోజుల్లో వీటిని సమకూర్చనున్నట్లు తెలిపారు. విద్యాలయాల్లో సమస్యలు, వసతుల అవసరాలు ఉంటే ఎప్పుడైనా తనను సంప్రదించాలని, తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్న ఎమ్మెల్యే, రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించేలా విద్యార్థులను ప్రోత్సహించాలని కోరారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ గురుకుల విద్యాలయాల నిర్మాణం జరుగుతోందని, ఒక్కో విద్యాలయాన్ని సుమారు రూ.200 కోట్లతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇది విద్యారంగంపై ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ మార్కెట్ చైర్మన్, మండల అధ్యక్షులు, సర్పంచులు, ఉపసర్పంచులు, మార్కెట్ డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బాలసదనం, శిశుగృహాల తనిఖీ

### పిల్లలకు అందుతున్న సౌకర్యాలపై సంతృప్తి



కరీంనగర్,జనతా న్యూస్ : మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలసదనం, శిశుగృహ పిల్లల సంరక్షణ కేంద్రాలను గౌరవ కే. రాణి, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి మరియు జిల్లా న్యాయ సేవా సాధికారత సంస్థ ఇంచార్జి జడ్జి సందర్శించారు. ఈ సందర్భంగా పిల్లల సంరక్షణ కేంద్రాల్లో వారికి అందిస్తున్న వసతులు, సౌకర్యాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రాల్లో పిల్లల సంరక్షణ విధానం సంతృప్తికరంగా ఉందని పేర్కొన్నారు. అలాగే దత్తత (అడాప్షన్) మరియు పోస్టర్–కేర్‌కు సంబంధించిన వివరాలను కూడా తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సాధికారత విభాగం సూపరింటెండెంట్ సుజాత, బాలసదనం సూపరింటెండెంట్ సంతోషిని, శిశుగృహ మేనేజర్ ఇంచార్జి డోలి తేజస్విని, కీర్తి, రమ, శిశుగృహ సోషల్ వర్కర్ ఇంచార్జి సాదినేని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పీవీ నరసింహారావు ఆర్థిక సంస్కరణలతోనే దేశం అన్ని రంగాల్లో ముందడుగు

### వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు - కాంగ్రెస్ నేతల నివాళులు




కరీంనగర్, జనతా న్యూస్: పీవీ నరసింహారావు ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణల వల్లనే నేడు భారతదేశం అన్ని రంగాల్లో ప్రపంచ దేశాలతో పోటీ పడగలుగుతోందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం అన్నారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు వర్ధంతి సందర్భంగా మంగళవారం కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనతో పాటు కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్ తదితర నాయకులు పాల్గొని పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, బహుభాషా కోవిదుడిగా, 1991 నుంచి 1996 వరకు భారతదేశ ప్రధానిగా పనిచేసిన పీవీ నరసింహారావు పారిశ్రామిక విధానాలు, ఆర్థిక సంస్కరణల ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేశారని గుర్తు చేశారు. గ్లోబలైజేషన్‌కు బాటలు వేసి దేశానికి అంతర్జాతీయ ఖ్యాతి తీసుకువచ్చిన గొప్ప నాయకుడని కొనియాడారు.

మైనారిటీ ప్రభుత్వంలో ఆర్థిక శాఖ మంత్రిగా మన్మోహన్ సింగ్‌ను నియమించి, సంస్కరణల అమలుకు బలమైన నాయకత్వం అందించారని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, ఏఐసీసీ అధ్యక్షుడిగా, ప్రధానిగా పీవీ నరసింహారావు చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆయన మన ప్రాంతానికి చెందిన నాయకుడిగా ఉండటం ప్రతి ఒక్కరికీ గర్వకారణమని పేర్కొన్నారు. పీవీ నరసింహారావు ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు, ఆయన కన్న కలలను సాకారం చేసేందుకు కాంగ్రెస్ శ్రేణులంతా కృషి చేస్తామని ఈ సందర్భంగా నేతలు స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో బానోతు శ్రావణ్ నాయక్, వంగల విద్యసాగర్, దన్న సింగ్, పొన్నం మధు, సిరికొండ శివప్రసాద్, కుంభాల రాజు కుమార్, గంగుల దిలీప్, పర్వత మల్లేశం, కంకణాల అనిల్ కుమార్ గుప్తా, చింతల కిషన్, మాదాసు శ్రీనివాస్, శ్రీరాముల రమేష్, వీర దేవేందర్, సత్తినేని శ్రీకాంత్, సరిల్లా రతన్ రాజు, సుదర్శన్, స్వప్న శ్రీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలి: జిల్లా కలెక్టర్




సిద్ధిపేట, జనతా న్యూస్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలల్లో మెరుగైన ఫలితాలు సాధించి, ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా పనిచేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలల ప్రిన్సిపల్స్, అధ్యాపకులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఏడాది, ఈ ఏడాది ఇప్పటి వరకు నిర్వహించిన పరీక్షల ఫలితాలను కళాశాల వారిగా సమీక్షించి, ఎదురవుతున్న సమస్యలపై ప్రిన్సిపల్స్‌తో చర్చించారు.

ఇంటర్మీడియట్ పరీక్షల్లో విద్యార్థులు అన్ని సబ్జెక్టులపై ఏకాగ్రత చూపేలా ప్రిన్సిపల్స్, అధ్యాపకులు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. కఠినమైన విషయాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి బోధించాలని ఆదేశించారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో జరిగే బోర్డు పరీక్షలను దృష్టిలో పెట్టుకుని, 50 రోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని తెలిపారు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణతే లక్ష్యంగా పని చేయాలని స్పష్టం చేశారు.

విద్యార్థులను ప్రోత్సహించి మంచి ఫలితాలు సాధిస్తే వచ్చే విద్యా సంవత్సరంలో కళాశాలల్లో అడ్మిషన్లు పెరుగుతాయని పేర్కొంటూ, ఆ దిశగా అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రిన్సిపల్స్, అధ్యాపకులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించి, విద్యార్థులకు చదువు, క్రమశిక్షణ అలవాటు చేసి వారు ఉన్నత స్థాయికి చేరుకునేలా తీర్చిదిద్దాలని అన్నారు.

అలాగే జిల్లాలోని పలు జూనియర్ కళాశాలల్లో అవసరమైన ప్రధాన, చిన్న మరమ్మతులు జనవరి 15లోపు పూర్తిచేయాలని ఆదేశించారు. కళాశాలలకు కావాల్సిన మౌలిక వసతులను ప్రాధాన్యత క్రమంలో కల్పిస్తామని తెలిపారు.

ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి రవీందర్ రెడ్డి, వివిధ కళాశాలల ప్రిన్సిపల్స్ తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com